క్లుప్తంగా

జగనన్నకు భద్రత పెంచాలి



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ ప్రభాకర్

కర్నూలు (టౌన్): 'రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో జెడ్‌ప్లస్ సెక్యూరిటీ కల్పించాలి' అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్ జోనల్ కో ఆర్డినేటర్ ఎం.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం లీగల్ సెల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌పై దాడి సంఘటన ప్రజాస్వామ్యం మనుగడను ప్రశ్నిస్తుందన్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో ప్రచారం చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను భంగం కలిగించడం తీవ్ర నేరమన్నారు. దాడి కుట్రకు పాల్పడిన వారిని వదలకూడదన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో, భగవద్గీత తరగతులు, శ్రీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు.

'లంకమల దారుల్లో' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత వివేక్ రాసిన 'లంకమల దారుల్లో' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. రిటైర్డ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నరాల చంద్రమోహన్‌రెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, సాహితీవేత్తలు చంద్రశేఖర కల్కూర, నాగారెడ్డి సుబ్బారెడ్డి, కాశీపురం సుబ్బారెడ్డి, నాగమణి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

నూతన ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణం

కర్నూలు కల్చరల్: స్థానిక శరీన్ నగర్‌లోని శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయానికి ప్రదానం చేసిన నూతన శ్రీరామ, సీత, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల పంచ లోహ ఉత్సవ విగ్రహాలకు ఆదివారం ఆలయంలో సంప్రోక్షణం నిర్వహించారు. నగరానికి చెందిన డమాం లక్ష్మణ కుమార్, కల్పన రూ.లక్ష దాతృత్వంతో విగ్రహాలను ఆలయానికి అందజేశారు.

వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : నగరంలో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కళ్యాణ మండపంలో కరాటే శిక్షకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

జగనన్నపై దాడి బాబు కుట్రే



కర్నూలు (టౌన్) : 'జగనన్నపై రాళ్ల దాడి చంద్రబాబు కుట్రే. దాడులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని బెదిరించాలని చూస్తే మరింత బలంగా పని చేస్తా'మని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్రలకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్ష నేతలు కుట్రకు పన్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు రోడ్ల మీద తిరగలేరన్నారు. దేశంలోనే అత్యధిక ప్రజా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయన సీఎం కావడం తథ్యమన్నారు. ఐదేళ్లుగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, మహిళలు జగనన్న వెంటే ఉన్నారని ఎన్నిల్లో ఓటు ద్వారా వారి సత్తా చాటుతారన్నారు.

భక్తి శ్రద్ధలతో అరుణ పారాయణం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి మేష సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు పురుష సూక్త అరుణ పారాయణ పూర్వక సుగంధ ద్రవ్య జలాభిషేకం, క్షీరాభిషేకం, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు, నక్షత్ర మహా మంగళ హారతి, వేద స్వస్తి, అరుణ మహాసౌర హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి.

నేడు డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు బీక్యాంప్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విజువల్లీ ఛాలెంజ్డ్ డిజిటల్ లైబ్రరీని సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభిస్తారని నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

అంబేడ్కర్ మార్గం..అనుసరణీయం

● నగరంలో ఘనంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ జయంతి ● మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దళిత, గిరిజన, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి,నెట్ వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమని వివిధ ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు కొనియాడారు. ఆదివారం బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలు దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు,వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు ప్రదర్శనగా వచ్చి బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగరంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిరాడంబరంగా సాగింది. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా రాజ్యాంగ నిర్మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి సంబంధిత అధికారులు నివాళులర్పించారు.

● స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ మేయర్ బంగి అనంతయ్య, నాయకులు సీహెచ్ మద్దయ్య, రైల్వే ప్రసాద్, కేదార్‌నాథ్, కిషన్, చెన్నమ్మ, నాగవేణిరెడ్డి, సుచరిత, గద్ద రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, సీనియర్ బీసీ నాయకులు గడ్డం రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, నాయకులు ఎస్‌సీహెచ్ బజారి, సీ సుంకన్న, ఆర్ సంజీవ్‌కుమార్, రామాంజనేయులు, బాల నారాయణ, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నీలం రంగు కండువాలతో ప్రదర్శన నిర్వహించారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం 2024 డైరీని విడుదల చేశారు.

● జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, కార్యాలయ పరిపాలనాధికారి సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

● జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డీఎండబ్ల్యూఓ డా. సునీల్‌కన్నా బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు డి శ్యాంబాబు, హెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

● కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సమితి నగర అధ్యక్షుడు రమణ, నాయకులు పాల్గొన్నారు.

● దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయ సీఆర్ భవన్‌లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేష్, నాయకులు పాల్గొన్నారు.

● జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు బాబూరావు, మాజీ మంత్రి మారెప్ప, నాయకులు అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

● జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. క్రిష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్, సీనియర్ న్యాయవాది వై. జయరాజ్, న్యాయవాదులు టీఎస్ నాయుడు, కె ఓంకార్, ఏ మాదన్న, చంద్రుడు, సుమన, ఆనందరావు, జగదీష్, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● రాయలసీమ విశ్వవిద్యాలయంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం నరసింగరావుపేటలోని పార్టీ నగర కార్యాలయంలో బాబా సాహెబ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● జైభీమ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ ఎస్ కూడలిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌తో పాటుమాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి, అహమ్మద్ అలీఖాన్ పాల్గొన్నారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు రైల్వే ప్రసాద్, పార్టీ నాయకులు, జైభీమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● స్థానిక విద్యుత్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం తరఫున ఎస్‌ఈ ఉమాపతి సంతోష్‌నగర్‌లోని కీర్తన అనాథపిల్లల ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

● నగరపాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● కోడుమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాబా సాహెబ్ సేవలను వారు కొనియాడా రు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, ఏఓ అరుణ, డీఎస్‌వో డాక్టర్ నాగప్రసాద్, డెమో ప్రమీలాదేవి, ఎస్. హేమసుందరం, డీపీవో విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ సెంటర్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో 'రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై జనవకసం నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, గౌరవాధ్యక్షులు బసవరాజు, సాహితీ వేత్త డాక్టర్ వి.పోతన్న, కవులు సయ్యద్ జహీర్ అహ్మద్, శివాంజనేయులు, పార్వతయ్య, శేఖర్, హసీనా, నిసార్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో రచయితలు నాగేశ్వరాచారి, మారుతి, చౌశా, మహమ్మద్ మియ్యా, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత సేవలు ఎనలేనివి

కల్లూరు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా కల్లూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. సీఎం వైఎస్ జగన్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, మహిళ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతా రెడ్డి, కార్పొరేటర్లు నరసింహులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీ కాంతరెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిద్ధా సత్యనారాయణమ్మ అన్నారు. ఆదివారం బాబాసాహెబ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, పార్టీ నాయకులతో కలిసి ఆమె అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్, గడ్డం రామకృష్ణ, మహిళా విభాగం రాష్ట్ర నాయకులు లావణ్య, నాగేశ్వరీ పాల్గొన్నారు.

ఎన్ని కూటములు వచ్చినా మళ్లీ జగనే సీఎం



వృద్ధురాలికి ఓటు అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని పెద్దపాడు, ఎ.నాగలాపురం, అలాగే నెరవాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిందని, నవరత్నాల పథకాల వల్ల పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. అర్హతే ప్రమాణికంగా తీసుకుని కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటి సిఫారస్సులతో పాటు నాయకుల అండదండలు ఉంటేనే పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేవని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనకు ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పాలనకు తేడాను గమనించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డులోని పెద్దపాడు గ్రామానికి 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఆదివారం డిప్యూటీ మేయర్ రేణుక, శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈశ్వర్, గిడ్డయ్య, లక్ష్మీనారాయణ, రాముడు, ఎస్సీ కాలనీ యూత్ 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారందరికి ఎమ్మెల్యే కాటసాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



కాటసాని శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న జంపాల శివయ్య నగర్ వాసులు

34వ వార్డులో..

కల్లూరు అర్బన్ 34వ వార్డు పరిధిలోని జంపాల శివయ్య నగర్‌కు చెందిన సుమారు 500 టీడీపీ కుటుంబాలు యువనేత కాటసాని శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. జాషువా, విజయ్‌కుమార్, తిమోతి, మురళి, మధు, మద్దితో పాటు 500 కుటుంబాలు పార్టీలో చేరాయి.

'ఇంటింటికీ ఇంతియాజ్'కు బ్రహ్మరథం

● ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
● ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరువ
● వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని భరోసా



బుధవారపేటలో వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు, నేతలకు హారతులిస్తున్న మహిళ

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. రోజురోజుకు ఆయనకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. తాజాగా ఆయన ఇంటింటికీ ఇంతియాజ్ పేరుతో నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల జనరంజక పాలనను వివరిస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేస్తున్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్ సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. ఆదివారం రాత్రి స్థానిక 16 వ వార్డు బుధవారపేటలో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌తో పాటు కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవైరామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్ పాల్గొన్నారు. వీరికి ఆ వార్డు మహిళలు హారతులు పట్టి.. పూలదండలతో సత్కరించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. చిరు వ్యాపారులతో మాట్లాడారు. జగనన్న పథకాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు వివిధ పథకాల ద్వారా తమకు కలిగిన లబ్ధిని తెలియజేసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఇంతియాజ్, బీవై.రామయ్య మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాలను ఆర్థికంగా ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం అమలు చేయని తెలుగుదేశం నాయకులు ఇప్పుడు ఇళ్ల వద్దకు వస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మొద్దన్నారు. వాళ్లకు ఓట్లు వేస్తే జగనన్న పథకాలు రద్దు చేస్తారని చెప్పారు. 2014లో ఇచ్చిన హామీలనే అమలు చేయని చరిత్ర చంద్రబాబుదన్నారు. నమ్మించి మోసం చేసిన ఆయనకు ఎన్నికల్లో మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోఆప్షన్ మెంబర్ శ్రీరాములు, పప్పి, దినకర్, బాబర్, పవన్ మహేష్ గౌడ్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు సన, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నాయకులు అహమ్మద్ అలీఖాన్, ముస్తాఫా ఆధ్వర్యంలో నగరంలోని 17 వ వార్డుకు చెందిన ఎద్దుపెంట అంజితో పాటు 300 మంది కార్యకర్తలు పార్టీ చేరారు. పార్టీ నగర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంతియాజ్ వారికి వైఎస్సార్‌సీపీ కుండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మెయిద్‌ఖాన్, నాగార్జున గౌడ్, మల్లిఖార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14 వ వార్డు నుంచి..

స్థానిక బుధవారపేటలో షేక్ ఖాజా మోహిద్దీన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు హకీమ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు పార్టీలో చేరారు. కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి, అహమ్మద్ అలీఖాన్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగనన్న పాలన నచ్చి నగరంలోని 8 వ వార్డు, 14 వ వార్డు 17 వ వార్డులకు చెందిన టీడీపీ శ్రేణులు, యువకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆది మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, చెన్నమ్మ, సుచరిత పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన 17 వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు



వైఎస్సాఆర్‌సీపీలో చేరిన 14 వ వార్డు ప్రజలు

సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం అమానుషం

● ఎన్నికల్లో ఎదుర్కొనలేక కుట్రపూరితమైన పనులు
● ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక ఇలాంటి చర్యలు
● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
● నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, నాయకులు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడ సింగ్‌నగర్‌లో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో హత్యాయత్నం చేయడం అమానుషమని పాణ్యం కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేటర్లు, నాయకులు సీఎంపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సిద్ధం సభలు విజయవంతం కావడం, అలాగే మార్చి 27న ప్రారంభమైన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రారంభమైన రోజు నుంచి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు ఎంతో విశ్వాసం, నమ్మకం ఉందన్నారు. మూడు పార్టీలు కలసి కూటమిగా ఏర్పడి ఎన్ని కుతంత్రాలు, జిమ్మికులు చేసినా జగన్‌ను ఎదుర్కోలేకపోతున్నారని చెప్పారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు, కళాశాల విద్యార్థులు వచ్చి ఎవరి ప్రమేయం లేకుండా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతుండడం, ప్రజల్లో సీఎం జగన్‌కు ఉన్న అభిమానం, ఆదరణ చూసి కూటమి పార్టీల నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. సీఎంను ప్రజల్లో తిరగకుండా చేయాలనే ఉద్దేశంతోనే దాడి చేసినట్లు తెలుస్తోందన్నారు. ఎడమ కన్నుపై భాగంలో కాకుండా కణతకు తగిలింటే పరిస్థితి ఎలా ఉండేదోనని ఊహించుకుంటే చాలా బాధ కలుగుతుందన్నారు.

ప్రజల్లో భీతి కలిగించాలనే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బస్సుయాత్రలో ప్రజలు, మహిళలు పూలతో, హారతులతో స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అది చూసి ఓర్వలేక, రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రజల్లో భీతి కలిగించాలనే లక్ష్యంగా ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. నాయకుడికి ప్రజల్లో అభిమానం ఉంటే తప్ప సానుభూతితో ఎన్నికల్లో గెలవలేమన్నారు. 2004లో అలిపిరి ఘటనలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎలాంటి గాయాలు కాకున్నా చేయికి కట్టు కట్టుకుని సింపతి వస్తుందని ఎన్నికల ప్రచారం చేశారని, అయినా ఓటమి తప్పలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామికి పూజలు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. ఆదివారం భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం, సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, సాయంత్రం పూలంకి సేవ, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

● ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు నిర్వహించారు. పడి పూజ, పూలంకి సేవలు విశేషంగా జరిగాయి. లలితా పీఠం గురుస్వాములచే నిర్వహించిన అయ్యప్ప భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సంక్షేమాభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (సిటీ) : సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా 58 నెలల్లో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి, చేసిన మేలు గురించి, గతంలో టీడీపీ ప్రజలను ఎలా మోసిందో వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపొంది హ్యాట్రిక్ విజయం నమోదు చేయబోతుందని చెప్పారు. జగనన్న నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతం కావడం, మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్రకు జనాల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక విజయవాడలో ప్రతిపక్ష పార్టీ జగనన్నపై దాడులకు తెగబడిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, వైస్ ఎంపీపీ నెహిమియ, సర్పంచులు శ్రీనివాసులు, విద్యాసాగర్, మాజీ ఎంపీటీసీ చిన్నలక్ష్మన్న, గార్గేయపురం సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీలు రామనాథ్‌రెడ్డి, హనుమంతు, ఎల్లమ్మ ఆలయం ట్రస్టు బోర్డు చైర్మన్ మహేష్ రెడ్డి పాల్గొన్నారు.